# కీలుబొమ్మ

రైలుప్రయాణం చేసేటప్పుడు మొత్తంమీద రకరకాల మనుష్యులు తటస్థపడుతూంటారు...

అతనంతట అతనే నన్ను పలకరించాడు, నాకు నేనైనె కొత్తవాళ్ళను పనిలేకుండా సామాన్యంగా పలకరించను. ఎందాకానన్నాడు, చెప్పాను. ఎక్కణ్ణించన్నాడు, అదీ చెప్పాను. ఏవేవో సంగతులు తెచ్చాడు. అతని ఉత్సాహం స్నేహభావం నాకూ అంటుకున్నై. మనిషి చాలా అందంగా నాజూగ్గా ఉంటాడు. అతని మొహంలో ఆనందం ఆరోగ్యం తాండవిస్తున్నై. అతని జన్మలో చింతకాని ఆగ్రహంకాని ఉన్నట్టులేదు. అతని మొహాన నవ్వటాని కలవాటుపడ్డ లక్షణాలున్నై కాని కోప్పడటానిక్కాని దుఃఖించటానిక్కాని ఆ మొహం అలవాటుపడ్డట్టులేదు. డబ్బు పుష్కలంగా ఉండి విరివిగా ఖర్చుపెట్టే మనిషల్లే కనపడ్డాడు. అతిశయంకాని బెట్టుసారికాని ఉన్నట్టు లేదు మనిషిదగ్గిర. ఎక్కువ తెలివిగలవాడల్లే కనిపించలేదు కాని మందమతి కాదు.

మాసంభాషణ ఎట్లావెళ్ళిందో 'విధి' మీదికివెళ్ళింది.

'మనుషులకు విధి ఉన్నట్టే దేశాలకూడా విధి ఉంటుంది కామాలు?' అన్నాడతను.

నేను నవ్వి 'మనుష్యులకు విధి ఉంటుందని రుజువెక్కడయింది?' అన్నాను.

అత నాశ్చర్యంతో 'ఎందుక్కాలేదు?' అన్నాడు. అతని మొహాన ఆశ్చర్యం చూసినప్పుడు ఒక కొత్త విషయం కనిపెట్టాను. ఆశ్చర్యంలోకూడా నవ్వటానికి వీలున్నప్పుడు నవ్వులో ఎందుకు నవ్వకూడదు? అందుచేతనే అతని నవ్వులో వెన్నెల్లు కాయటం! బహుశా అందుకనే కొందరినవ్వు చవితివెన్నెలల్లే ఉంటుంది!

సరే నేను ఎక్కడయిందన్నాను. అతను నవ్వుతూ 'నేను రుజువుచేశాను,' అన్నాడు.

'ఉండం డుండండి! మీ ఉద్దేశంలో విధి అంటే ఏమని? ఎందుచేతంటే కర్మఫలితాన్ని నేను విధి అని అంగీకరించను. పంచదార తీపిగాఉండటాని కేవిధీ సహాయ్యం చెయ్యక్కర్లేదు. అదే విధి అయితే దేశాలకూడా విధి ఉంది—కొద్దిమంది వ్యక్తులు చేసిన కర్మయొక్క ఫలితం దేశమంతా అనుభవిస్తుంది. అప్పుడు దేశాలకూడా విధి ఉంటుంది మరి.'

అతను మెల్లిగా తల అడ్డంగా తిప్పాడు.

'అదికాదు నేను చెప్పే విధి. విధంటే మనం మనోవాక్కాయాలా చేసే కర్మకు సంబంధంలేకుండా మన భవిష్యత్తును నిర్ణయించేది. అటువంటి విధంటూ ఉందని మీరు నమ్ముతారా?'

'ఎన్నటికీ నమ్మను! ఖచ్చితంగా చెప్పగలను. తన యిష్టానుసారం మనల్ని నడిపించే విధి ఉందని ఎవరైనా నిరూపిస్తే నేను జీవితంలోనూ, న్యాయంలోనూ, ధర్మంలోనూ అర్థంలేదని ఒక్కక్షణంలో నిరూపిస్తాను,' అన్నాను.

'మీరుచెప్పింది నిజం. వాటిల్లో అర్థంలేదనే తీర్మానానికి నేనూ అదివరకే వచ్చాను. వాటిని నేనిప్పుడు పాటించటంలేదు! అన్నాడతను.

నేను నిర్ఘాంతపోయినాను. అతను అబద్ధం ఆడుతున్నాడో. లేక న్యాయం, నీతీ, ధర్మం మొదలైనవి పాటించనివాడి మొహాన 'లుచ్ఛా' అని రాసిఉంటుందని నేనింతకాలం అనుకోటం పొరపాటా? ఇటువంటి వాటికి సంఘంలో ఎక్కువప్రాముఖ్యత ఇస్తున్నామా? అట్లా అనవసరమైన ప్రాముఖ్యత ఇస్తున్నామని రుజువైతే ఇప్పుడు చేస్తున్నట్టుగా ప్రతివాడూ మిగిలినవాళ్ళలో పాలేరుతూ కాలయాపన చెయ్యకుండా చాలాసుఖంగా జీవించవచ్చునేమో?

'ఏమి టాలోచిస్తున్నారు!' అన్నాడతను.

అంటే, మరేమీ లేదు. మీరు ఒకమాటకు ఒకమాట ఉపయోగిస్తున్నారేమోనని నా అనుమానం!...ముందు వినటూ ఉందని రుజువుచెయ్యండి చూద్దాం! తరవాత నా ఆలోచన చెబుతాను!'

అతను బిగ్గరగా నవ్వి 'విధంటూ లేదని మీ కెట్లా తోచిందండీ! ప్రతిరయితూ సాలుకు కొన్ని లక్షల వరి మొక్కల తదితర జీవాలను తన ఇచ్ఛానుసారం పెంచి చంపుతున్నాడు. మనం మన పెంపుడు జంతువులను మన యిష్టానుసారం పెంచటమే కాక మనయిష్టం వచ్చిన కొత్తజాతులు పుట్టిస్తున్నాం. సృష్టికి మనిషే నాయకుడా? మనిషిమీద ఇంకా ఎన్నిరకాల జీవరాసులున్నయ్యో!' అన్నాడు.

'ఉంటే కనిపించవేం?'

'మనం చెట్లకేం కనిపిస్తాం?'

'అదా మీవాదన?...అసలు చెట్లకు ప్రాణం ఉందని అంతా ఒప్పుకోలేదు?' అని ఒకచొప్పదంటు వాదన అడ్డం పెట్టాను.

'మనకు ప్రాణం ఉందని ఎవరు రుజువుచేశారు. ఎవడో కథలో రాక్షసుడి ప్రాణం ఎక్కడో దాచి పెట్టిన ఈగల్లో ఉన్నట్టు మనప్రాణం గుండెకాయ మొదలైనవాటిలో ఉండవచ్చును. అవి వేరేప్రాణులు కావని ఎవరు నిరూపించారు? అటువంటి తెలీనివిషయాలు మనకొద్దు. చెట్లు కర్మ చేస్తున్నై. వాటికి మంచిచెడ్డలున్నై. చెట్టు తనమేలుకోసరం ఆకులను చీల్చుకుంటుంది రాల్చుకుంటుంది. అది కర్మ కాదా? దాని ఆహారం అది వెతుక్కుంటుంది. మనం అంతకన్న చేస్తున్నదేమిటి? మనకన్న తక్కువతరగతి ప్రాణులను చూసి మనమే ఉన్నతంగా ఉన్నామని అహంకరించటం ఎందుకు? మనకన్న పెద్దతరగతి జీవాలు కొన్ని పరిపాలిస్తున్నట్టు నేను గట్టిగా నమ్మాను. వాటికి మనం లొంగిఉండక చేసేదేమీ కనిపించలేదు.'

'మనకన్న ఎక్కువవాళ్ళు మనల్ని కీలుబొమ్మలాడించినట్టు ఆడిస్తున్నారని మీ కెట్లా నమ్మకం కలిగింది?'

'వినండి. నేను చిన్నతనంలో రెండుసార్లు చచ్చి బతికాను. మాటవరస కనటంకాదు. నిజంగా చచ్చిబతికాను! మానాన్న గొప్పడాక్టరు. రెండుసార్లకూడా ఆయనా ఆయనస్నేహితులైన పెద్దడాక్టర్లూ ప్రాణం పోయిందని సర్టిఫైచేశారు. రెండుసార్లకూడా ఒక ఔషధసహాయంగాని ఒక చికిత్సగాని లేకుండానే బతికాను. నన్నెవరు బతికించారు?

'నా జీవితంలో ఇటువంటివి శతసహస్రాలు. నా వివాహంగురించి చూడండి. నా పెళ్ళి నిశ్చయమైన కొద్దికాలానికే యీ సంబంధం నా యజమానికీ—నన్ను ఆడిస్తున్న దేవతకు—ఇష్టంలేదని నాకు తట్టింది. ఎవరితోనూ చెప్పలేదు. ఆ వివాహం అయిదురోజులూ నాకు ఇదీ అదీ అని తెలీనిరోగం! నాభార్య కాపరానికి వచ్చినతరవాత మా ఇద్దరిమధ్యా ఎవరో అడ్డం వస్తూనే ఉండేవాళ్ళు పానకంలో పుడకల్లే. ఏమీ జరక్కుండానే నా ఉత్సాహంయావత్తూ ఎక్కడికో పీల్చుకుని పొయ్యేది. అటువంటిది కేవలం సైకలాజికల్ అని అనగలు. నేనప్పటికి విధిలో నమ్మకం కలవాణ్ణి కాను. ఈ కనిపించని భూతం నాకూ నాభార్యకూ మధ్య పెట్టనిగోడ అయిపోయింది. నాభార్య చాలా మంచిది. మొదట్లో నాకు దాన్నిచూస్తే ఎంతో ప్రేమ. నా భార్యఎదురుగా లేనంతసేపూ దాన్నిగురించే ఆలోచించేవాణ్ణి ఎదురుగారాగానే నా కళ్ళలో కారం కొట్టినట్టయ్యేది. లోపలనించి విపరీతమైన అసహ్యం పుట్టేది.

'చాలా కాలం ఈ దయ్యాన్ని తోలెయ్యాలని ప్రయత్నంచేశాను. అప్పటికింకా ఈదయ్యం నాలోనే ఉందని నాభ్రమ. నాకు బాహ్యంగా ఉందని తెలీదు...చివరకు నా భార్యను వదిలేశాను!

'ఆరోజుల్లో నా స్థితి చాలా భయంకరంగా ఉంటూ వచ్చింది. మానాన్న ఏమీ మిగిల్చిపోలేదు. ఇన్స్యూరెన్సు ప్రీమియములు కట్టటంమానేసి దానధర్మాలు చేశాడు! నా విద్యాభ్యాసం మధ్యలో తెగిపోయింది.

'నాభార్యను పుట్టింటికి పంపించేసిన మర్నాడు నేనెన్నడూ ఎరగని పెద్దమనిషి మానాన్న స్నేహితు

ణ్ణంటూవచ్చి నాకు ఉద్యోగం ఇస్తానన్నాడు!...

'నాకు భోగంవాళ్ళంటే ఎప్పుడూ అసహ్యమే! ఒకరోజున నేను సానివీధివెంబడి పోతుండగా నన్నెవరో ఒకయింట్లోకి పొమ్మని ప్రేరేపించినట్టయింది. ఆ యింటిది తాగుబోతు. ఉత్త దరిద్రపు లంజ నాకు దాన్నిచూస్తే ఆవగింజంత ప్రేమలేకపోగా పరమ అసహ్యం. అయినా ఆయింట్లో దూరాను!... మర్నాడు ఒక పెద్దమనిషి నన్ను ఒక బాంకు ఏజంటు దగ్గిరికి తీసుకుపోయి నెలకు డెభ్భై రూపాయలమీద నన్ను గోడౌన్కీపరుగా నియమింపచేశాడు. నాకాపని కూడా తెలీదు. ఆఉద్యోగంలో ఉంటూ నాకిష్టంలేనివీ ఎక్కడైనా వింటే కోట్లో ఉమ్మేసేవీ అనేకపనులు చేశాను. నామీద కేసులుకూడా వచ్చినై. నన్ను నా యజమాని దివ్యంగా తప్పించాడు. నాప్రయత్నం ఏమీ లేదు. నా అభివృద్ధికి ఏమీలోపంరాలేదు. కొద్ది కాలం కిందటే నన్ను ఏజంటుచేశారు. ఇప్పుడు రొండువందల యాభై ఇస్తారు!...

'నేనిప్పుడు ఎవర్నీ తప్పుపట్టను. నన్ను తప్పుపడితే సహించను! నాజీవితానికి నాఅనుజ్ఞ ఎంతమాత్రం లేకుండా ఉంటున్నది. నేనేంచెయ్యాలి? నన్నుపట్టిన గ్రహం చాలాదుష్టగ్రహంగా కూడా ఉంది! భగవంతుడనేవాడుంటే అతణ్ణి చాలాకాలంనించీ ప్రార్థిస్తున్నాను నన్ను మంచి గ్రహంచేతులో పారెయ్యవయ్యా అని. ఇంకా నా మొర ఆలకించలేదు భగవంతుడు.'

నేను కొంచెంసేపు ఆలోచించి 'చాలా విచిత్రంగా ఉంది—నిజమైతే! కాని ఒక్కకేసునుబట్టి ఏమీ తేల్చలేం!' అన్నాడు.

'ఒక్కకేసా! వందలు! వేలుచూపిస్తాను! మీరామాట అనటంబట్టి మీ రీవిషయాన్ని గురించి ఎన్నడూ ఆలోచించలేదని తెలుస్తుంది. నాఅనుభవం ఒకటి వినండి. నేను ఒకప్పుడు ప్రతి ఆడదీ పతివ్రతే అనుకునే వాణ్ణి. అప్పుడు నాకు రంకువాళ్ళనుగురించి ఆలోచనే లేదు. తరవాత ఎందుచేతనో ఆవిషయం ఆలోచన వచ్చినప్పుడు గమనిస్తే దాదాపు నేనెరిగిన ప్రతి ఆడదీ రంకుతనం చేసిన మనిషే! ఇంటికొకత్తె! అనేక విషయాలను గురించి ఆలోచించక మనం జీవితంలో నూటికి తొంభైతొమ్మిదిపాళ్ళు అసలు చూడనే చూడటం లేదు—విచారించటం మాట దేవుడెరుగు!... నేనిప్పుడు నాజీవితంలో నలుసులన్నీ ఏరితెచ్చాను కనుక నా జీవితం విపరీతమైనట్టు మీరు భావించుకుంటారు. కాని అందరి బతుకంటికిదే నాదికూడా. కారణంలేకుండా భార్యను వదిలేసిన వందల్లో నేనొకణ్ణి. లంచాలుపుచ్చుకుంటున్న వేలల్లో నేనూ ఒకణ్ణి. ముండల ఇళ్ళచుట్టూ తిరిగి సాధ్యమైనంతవరకూ తప్పించుకుంటూ పొరపాటున తగిలితే వెంటనే నయంచేసుకుంటూ తిరుగుతున్న కొద్దిమందిలో నేనొకణ్ణి. నన్నుబాగా ఎరిగిన వాళ్ళు విపరీతంగా చూడనే చూడరు!'

నే ననుమానంగా తలఊపాను.

'అందుకనే కృష్ణుడీతక్కువదేవతలను కొలవక తన్నేనమ్మి ఉండమన్నాడు! వీళ్ళను జయించటానికి ఇంద్రియనిగ్రహం కావాలి!'

'అదీ ఆలోచించాను. ఆ భగవంతుడి స్వరూపం తెలిస్తేకద ఆయన్ను నమ్మటమనేది జయప్రదంగా జరిగేది. నేను నమ్మేఉన్నాను. ఇక తక్కువదేవతలను ఎదిరించటం మాటా? మనిషికి ఎదురుతిరిగిన కుక్క మనిషికన్న ఎక్కువేఅవుతుందో తోడేలే అవుతుందో? నాకు వృద్ధిపొందాలనేఉంది కాని క్షీణించాలనిలేదు. ఇప్పటిమట్టుకు ఒక్కపని చేస్తున్నాను. నన్ను రొండు భాగాలు చేసుకున్నాను. ప్రస్తుతం అందులో ఒక భాగం మాత్రమే విధికి లొంగిఉన్నట్టూ, రొండోభాగం దానికి ఎడంగాఉండి దాని మంచిచెడ్డలను నిశ్చింతగా గమనిస్తున్నట్టూ నటిస్తున్నాను. అసలటువంటి రొండో భారం నాలోఉన్నట్టే ఉంది. కేవలంసైకలాజికల్ ఎఫెక్టే కావచ్చును మరి!' అంటూ అతనునవ్వాడు.

—కొడవటిగంటి కుటుంబరావు.